# కౌబాయ్ శ్రీవారు

## ఇచ్ఛాపురపు రామచంద్రం

శ్రీమతి శిల్పా!

ఎవరినుంచి ఈ ఉత్తరం అని ఆశ్చర్యపడుతున్నారా? నేనే ... ఆ మధ్య పెళ్ళిచూపులలో మిమ్మల్ని చూసిన చక్రపాణిని సిగ్గుపడుతున్నారా? స్త్రీకి సిగ్గు అందమే కాని సిగ్గులో పడి ఉత్తరం సాకల్యంగా చదవడం మానెయ్యకండేం? శ్రీమతి శిల్ప అని సంబోధించాననా తర్జన భర్జనకులోనవుతున్నారు వివాహితురాలయినా కాకపోయినా గౌరవనీయురాలయిన స్త్రీ- శ్రీమతి అనిపించుకుందుకర్హురాలే అని విన్నాను.

నాలుగు రోజుల కిందట మన పెళ్ళిచూపులు జరిగినప్పటినుంచీ నాలాగే మీరూ ఆనందమూ ఆందోళనా ఆత్రతా కలగలిసిన చిత్రమయిన మానసిక పరిస్థితి అనుభవిస్తున్నారనుకుంటాను. జేను స్త్రీకయినా, పురుషుడికయినా వివాహమనేది జీవితంలో అతి పెద్దదీ ముఖ్యమయినదీ అయిన మలుపు. ఈ మలుపు తిరిగాక అవతలి జీవితం ఎలా ఉంటుందో అన్న ఆతృత యిద్దరికీ సహజమే. ఎందుకంటే యిప్పుడు జరుగుతున్నవి బాల్య వివాహాలు కావు సరికదా ఒక విధంగా ఆలస్య కళ్యాణాలే (లేట్ మారేజెస్) వివాహ వేళకి స్త్రీపురుషుల వయసులు తక్కువ ఉండడం లేదు. పెద్దవాళ్ళయి వ్యక్తిత్వం స్పష్టంగానూ దృఢంగానూ రూపుదిద్దుకున్నాక జరిగే వివాహం కనుక- పెళ్ళనగానే ఒకవేపు కలలూ మరొకవేపు సందేహాలూ- రెండూ సహజమే యువతీ యువకులకి

పాశ్చాత్య దేశాలలో అయితే డేటింగ్ ఉంది గనక పెళ్ళికి ముందు ఒకరినొకరు అర్థం చేసుకొనేందుకు వీలుంటుంది. వధూవరుల యిష్టాయిష్టాలు అక్కడ చెల్లుతాయి మనది అమెరికాకాదు. భారతదేశం ఇక్కడ డేటింగ్ లేదు. కాని – ప్రేమ ఉంది! అది సినిమాలలోనూ సీరియల్ నవలలోనూ ఎంత పుష్కలంగా వరదలై పారుతుందో వాస్తవిక జీవితంలో అంత అరుదుగా ఉంటూంది. సినిమాలలోనూ కథలలోనూ అయితే- కాబోయే వధూవరులు పెళ్ళిచూపులలో ఒకరితో ఒకరు మాట్లాడుకుని వొకరి గురించి వొకరు కొంచెం మేరకయినా తెలుసుకొనే మంచి పని చేస్తారు మిథ్యా గౌరవాలలో కొట్టుకొనే మనలాటి మధ్యతరగతి కుటుంబాలలో పెళ్ళికి ముందు అబ్బాయీ అమ్మాయీ మాట్లాడుకోవడమనేది 'బరితెగించడ'మే ఔతుంది యింకా. అందుకే యీ లేఖ! మాటకి విలువా శాశ్వతత్వమూ నశిస్తూ రాతే మనుషులని కొంతవరకూ బంధించి ఉంచగలుగుతున్న యీ రోజులలో – ఒక విధంగా యీ పద్ధతే మంచిదేమో సరే అసలు విషయంలోకి వొస్తున్నాను.

నా వయసు ఇరవైతొమ్మిది.

నాలుగేళ్ళ క్రిందట ఉద్యోగం సంపాదించాను. టౌనులో ఒంటరిగా గదిలో ఉంటున్నాను

అదుగో! అప్పుడే మీరేమేమో ఊహించుకుంటూ నన్నపార్థం చేసేసుకోబోతున్నారు. నేటి సినిమాలూ నవలలూ ఏ యువకుడినయినా ప్రేమలో పడెయ్యకుండా వదలుతున్నాయా; నేనూ ఎవరినో ప్రేమించే ఉంటాననో, లేదా . నన్నూ ఎవరో ప్రేమించే ఉంటారనో మీరు ఛటుక్కున అభిప్రాయపడిపోతే-

"అబ్బే అలాటిదేమీలేదు." అని మాత్రమే అనగలను నేను

నమ్మడమూ మానడమూ మీ వంతు

ప్రేమలో పడలేదంటున్నాను కదా అని తొందరపడి నన్ను బుద్ధిమంతులలో జమ వెయ్యకండి. అనక పశ్చాత్తాపపడవలసి రావొచ్చు. అలాగ పశ్చాత్తాపపడవలసి రావడం నాకిష్టముండదు. అందుకేగదా యిలా మీకు ఉత్తరం వ్రాయడం! చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనముండవచ్చునేమో కాని తీరా పెళ్ళయిపోయాక ఎంతగా ఎన్నిసార్లు అయ్యో అనుకున్నా మళ్ళీ మీరూ నేనూ అవివాహితులం కాలేము కదా! అడుగు వేసేముందే ఎంతో ఆలోచించాలంటారే, వైవాహిక జీవితంలోకి – ఏడడుగులు వేసే ముందు యువతీ యువకులకి ఎంత ముందు జాగ్రత్త ఉండాలి!! నాకు జాగ్రత్త కొంచెం ఎక్కువే.

బ్రహ్మచారీ శతమర్కటః అని నానుడి ఉద్యోగ బ్రహ్మచారి సహస్ర మర్కటః ఏమో అంతవరకూ ప్రతిదానికీ నాన్నమీద ఆర్థికంగా ఆధారపడుతూ, నలుగురిలోనూ 'నిరుద్యోగి' అని చిన్నచూపు చూడబడేవాడికి ఉద్యోగం అనే కిరీటం వొచ్చి పడగానే నడమంత్రపుసిరి నరంమీద పుండులా అతన్ని నిలవనివ్వదు నిరుద్యోగ వైతరణిని చచ్చి చెడీ దాటి ఉద్యోగపు తీరం చేరిన అతను 'గొప్ప'గా ఫీలవడమే కాదు, తన 'గొప్పతనాన్ని ప్రదర్శించుకునేందుకు కూడా పాటుపడతాడు.

అదుగో అలా మొదలుపెట్టిందే యీ సిగరెట్! ప్రకటనలలో .. సినిమాలలో సిగరెట్ కాల్చేవాళ్ళు గొప్పగా కనపడ్డారు.హీమాన్ అనిపించారు గొప్పగా కనిపించ డానికి సులభ మార్గం సిగరెట్టు అనిపించింది. తరువాత నా చుట్టూ ఉంటూ సిగరెట్టు కాల్చేవాళ్ళ ప్రభావం గొడ్డుగోతిలో పడితే నలుగురూ నాలుగు రాళ్ళు వేస్తారుట. నా బలహీనత చూసి నలుగురూ నాలుగు కోణాల లోంచి నన్ను బలహీనుణ్ణి చేశారు కపట స్నేహితుడిలా యిట్టే అంటుకుని – మంచి స్నేహితుడిలా ఎంతకీ వదలకుండా ఉందీ సిగరెట్ ఈ సిగరెట్ అలవాటుందే యిది నిజంగా వేసేటప్పుడు వేపమొక్కా తీయబోతే ఆసిరెమ్మే

పెళ్ళిచేసుకుందామన్న నిర్ణయానికి రాగానే నేను చేసిన మొట్టమొదటి పని – సిగరెట్ మానెయ్యాలని ప్రయత్నాలు మొదలుపెట్టడం ఎందుకంటే – సిగరెట్ స్త్రీకి చాలా శత్రుత్వమట యీ దేశంలో

భర్త – పదే పదే తన పెదవుల మధ్య ఉంచుకుని- పరవశిస్తూ పొగపీలుస్తూ . కాల్చే సిగరెట్ మీద స్త్రీకి చాలా అసూయ కలుగుతుంది అతనెక్కడికి వెళ్ళినా – అతని హృదయాని కంటిపెట్టుకునో (సిగరెట్ పెట్టి జేబులో ఉంటుంది జేబంటే హృదయానికి దగ్గర), కరకమలాల నలంకరించో ... అధరాల నలంకరిస్తూనో ఉండే సిగరెట్‌ని చూసి స్త్రీ – తన ఆస్తిమీద అది అన్యాక్రాంతం జరుపుతున్నట్టు అసూయ చెందడమూ ఆగ్రహించడమూ సహజమే న్యాయమే. అందుకనే సిగరెట్ భార్యాభర్తల మధ్య కలతలు రేపుతుంది దాంపత్యంలో ఈ విషయం మీద నేను ఒకటి రెండు మంచి కథలు చదివాను.

నేను బ్రహ్మచారినయినా నా మిత్రులు కొందరు వివాహితులే. కాపురం చేసుకుంటున్నవారే. వాళ్ళతోనూ వాళ్ళ కుటుంబాలతోనూ చనువుగా ఉంటాను కనుక భార్యాభర్తల మధ్య సిగరెట్ ఎటువంటి సమస్య కాగలదో ... దాని పరిణామాలిలా ఉంటాయో స్వయంగానే చూశాను. అందుకే- జీవితంలోకి భార్య అనే భాగస్వామిని ఆహ్వానించబోయే ముందు- వాతావరణ కాలుష్యానికి, దాంపత్య జీవిత వాతావరణ కాలుష్యానికి దారితీసే స్మోకింగ్ వ్యసనం నుంచి విముక్తి చెందడం నా ప్రథమ కర్తవ్యంగా భావించాను.

సిగ్ క్యూర్ . నా అలవాటుని తప్పించలేకపోయింది. విల్ పవర్ ఎఫెక్టు కూడా నిల్వే

అయిపోయింది. సిగరెట్ కాల్చే ముందు ప్రతిసారీ పాకెట్‌మీద ఉండే చట్టబద్ధమయిన హెచ్చరిక– 'స్మోకింగీజ్ యింజూరీయస్ టు హెల్త్'ను మూడేసి 'సార్లు చదివేవాడిని ఫలితం లేక – చిత్తుగా ఓడిపోయాను నేనూ సిగరెట్టూ మిగిలాం మళ్లీ

కనుక – నేను స్మోకర్‌ని ప్రస్తుతం రోజుకొక ప్యాకెట్ (పది సిగరెట్లు మాత్రమే)తో సాగుతున్న యీ అగ్నిహోత్ర వ్రతం భవిష్యత్తులో ఎంత మాత్రమూ దిన దిన ప్రవర్ధమానం కాబోదని నేను ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాను. కొంత అనుభవంమీద చెబుతున్నాను కాబట్టి యీ విషయంలో మీరు నన్ను విశ్వసించవచ్చు సానుభూతి చూపొచ్చు

శిల్పా' సాటర్‌డే ఈవెనింగ్ ఫీవర్ గురించి మీరు వినే ఉంటారు పట్టభద్రులూ అనుదినమూ పేపరు చదివేవారూ తరచుగా ఆంధ్రాంగ్ల పత్రికలు చూసేవారూ – మీకు సాటర్‌డే యీవెనింగ్ 'ఫీవర్ గురించి తెలియదేమో అని నేను సందేహపడడమేమిటి. నా తెలివితక్కువగాని ఆ ఫీవర్ అమెరికా నుంచి భారతదేశానికి వ్యాపించింది ముఖ్యంగా– సిటీస్‌లోని ఉద్యోగ బ్రహ్మచారులకి దానికి తగిన కారణం ఉంది.

కొంత వయసు వొచ్చాక వొంటరితనమనేది స్త్రీకయినా పురుషుడికయినా దుర్భరమే మనసు – తోడు కోసం ఆక్రోశిస్తుంది ఉద్యోగం కోసం ఎదురుచూసే యువకుడికీ, ఉద్యోగస్తుడి కోసం నిరీక్షించే యువతికీ లేట్ మ్యారేజ్ తప్పనిసరే అందుచేత– వొంటరితనానికీ, తోచకపోవడానికి మనవంటి వాళ్లెందరో గురి అవుతూనే ఉన్నారు

రేపు ఆఫీసుకి వెళ్లవలసి ఉందనుకునేసరికి నేటి దినచర్య ఎంత సజావుగా సాగిపోతుందో, మర్నాడు శలవనేసరికి ఒక్కసారి మనసు అస్తవ్యస్తమై పోతుంది ఈ బ్రహ్మచారి జీవితంలో శనివారం ఎంత విచిత్రంగా సాగుతుందో గమనించి సహృదయంతో అర్థం చేసుకోండి శనివారం– ఉదయం – రూముకి దగ్గరలో ఉన్న కాఫీ హోటలువాళ్లు వేసే వేంకటేశ్వర సుప్రభాతం వినపడేసరికి మేలుకుంటాను, రోజూ ఎనిమిది వరకూ మంచం దిగని వాడిని సుప్రభాతం వింటూనే స్నానమూ అవీ కానిచ్చి– భక్తిగా దేముడికి నమస్కారం పెట్టుకుంటాను తరువాత రొటీన్ మామూలే ఆఫీసుకి పోతాను అంతవరకూ బాగానే ఉంటుంది సాయంత్రం ఆఫీసు నుంచి వొస్తానా– మనసు అదోలా ఐపోతుంది రేపు ఆదివారం, ఆఫీసుకి శలవు– అని రికార్డు మొదలౌతుంది మనసులో ఒక్కసారి అంతా శూన్యమయిపోతుంది స్తబ్ధత ఆవరించేస్తుంది కాలం– కదలకుండా ఆగిపోయినట్లు . గడవనట్లు ఏమీ తోచకుండా...

అదుగో అలాటి క్షణంలోనే 'బోర్' అనే దెయ్యం నా మనసుమీద దండెత్తి అతి సులభంగా లొంగదీసుకుంటుంది ఐడిల్ మాన్స్ బ్రెయినీజ్ డెవిల్స్ వర్క్‌షాపు కదా అన్నట్లు– డెవిలంటే మీకు తెలుసా? బహుశా తెలిసి ఉండదు డెవిలంటే– తెలుగు సీరియల్‌గా అనువదించబడిన ఆంగ్ల నవల కాదండీ శిల్పా డెవిలంటే– విస్కీ' అందుకే మీకది తెలియదు. డెవిల్ అంటే తినేసేది. మనిషి నావహించి మనసు నావరించి మరేమీ తోచకుండా చేసేది విస్కీ– మనిషి ఆరోగ్యాన్నీ, ధనాన్నీ, కాలాన్నీ తినేసేదే రేపాదివారం అనేసరికి– శనివారం సాయంత్రం యీ డెవిల్ నన్నూ ఆవహించేస్తుంది బార్‌కి పద ఫ్రెండ్స్‌తో జోరుగా గడుపు అని నిలవనివ్వకుండా తినెయ్యడం ప్రారంభిస్తుంది. ఒంటరిగా ఉంటానేమో యీ డెవిల్ నన్ను యిట్టే జయించిపారేస్తుంది వారానికోసారి వొక్కసారే దీనికి లొంగిపోతుంటాను ఐతే – మరో మనిషి, కాలక్షేపమూ ఉంటే యీ డెవిల్‌నీ సాటర్‌డే యీవెనింగ్ ఫీవర్‌నీ తప్పకుండా గెలవగలనన్న ఆశాభావం నాకు లేకపోలేదు డెవిల్‌ని బర్న్ చేసెయ్యాలని, శాశ్వతంగా బర్న్ చేసెయ్యాలని నాకు చాలా యిదిగా ఉంది నిజంగా సిగరెట్‌లాగే విస్కీకూడా స్త్రీకి అసహ్యమూ, ఆగ్రహమూ కలిగించి దాంపత్య జీవిత సుఖంలో నిప్పులు పోసేదే.



# కాబోయే శ్రీవారు

చూస్తున్నానుగా చుట్టూ ఉన్న కొందరిని

శిల్పా' చేదుగా ముఖం పెడుతున్నారు కదూ నా గురించి తెలుసుకుంటూ' ఇంకా ఏమేం చదవవలసి వొస్తుందో అని భయపడుతున్నారు కదూ?

మరొక్కటి చెప్పి యీ జాబితా ముగించేస్తాను వర్రీ అవకండి

సుఖ సంసారానికి- మగవాడి స్నేహితులూ స్నేహాలూ కూడా శత్రువులౌతుంటారు అప్పుడప్పుడూ వీరి ప్రభావం తక్కువకాదు స్నేహం మంచిదే కాని మితి మీరితే యిదీ అపవాదే ఔతుందేమో ఇల్లు పట్టకుండా స్నేహితులతో తిరుగుతూ వేళాపాళా లేకుండా అర్ధరాత్రి అపరాత్రి వొచ్చి తలుపు తట్టే భర్తని ఏ ఇల్లాలు ఎన్నాళ్లని భరించగలుగుతుంది? ఆమె ఎంత ఉత్తమ యిల్లాలయినా తనని యింటి దగ్గర వొక్కతెనే వొదిలేసి అతనిమట్టుకతను బలాదూర్‌గా తిరిగే మగవాడిని ఎలా క్షమించగలుగుతుంది?

నాకు స్నేహితులు లేరని స్నేహాలు లేవనీ కాదు ఐతే నేను హద్దులో నే ఉంటున్నాను నా స్నేహాలూ స్నేహితులూ నా శ్రీమతికే మాత్రమూ అసౌకర్యం కలిగించరని ఘంటాపథంగా చెప్పగలను మీరు నమ్మండి

ఇంతసేపూ మీకు నేను నా గురించి అన్నీ నిరుత్సాహకరమయిన విషయాలే . చేదునిజాలే చెప్పాను కదూ? మీ మనసుని బాధపెట్టాను కదూ? ఏం చేసేది? కీడెంచి మేలెంచమని కదా ఆర్యోక్తి అందుకని- ముందుగా నాలో నాకు కనిపించే చెడుని చెప్పాను ఐతే- నేనేమి సినిమాలలో నో నవలలో నో పాత్రని కానుకదా కేవలము మంచి, లేదా అంతా చెడ్డ- తో నో మాత్రమే ఉండడానికి? మనిషిని కనుక- సహజంగా నాలో మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది

శిల్పా' యింతవరకూ నాలోని అవలక్షణాలు మాత్రమే చదువుతూ మీరు నా గురించి సకల గుణాభిరాముడనుకునేసుకుని ఉంటారు పొరపాటు కాదది. వాస్తవమే ఇంక నాలో నాకు కనిపించే మంచి లక్షణాలను చెబుతాను, టూకీగా లేకపోతే నాకు ఆత్మస్తుతి మీకు బోరుగా అనిపిస్తుంది. తనని తాను ప్రశంసించుకోవడం ఆత్మహత్యాసదృశమే.

నాకు - పేకాటరాదు. చిరాకు కూడా గంటలకి గంటలు నడుము నొప్పెట్టేలా కూర్చోడం కనుక శలవు రోజులు యిల్లు పేకాట క్లబ్బయిపోయే ప్రమాదం ఎంత మాత్రమూ ఉండదు. గుర్రప్పందాల పట్ల అజ్ఞానమేకాదు అసహ్యమూను ఈజీ మనీమీద ఆశా, అభిలాషా రెండూ లేనివాడినే గనుక ప్రభుత్వ లాటరీ టికెట్లు కూడా కొనను మాటలతో కాని చేతలతో కాని ఒకరిని హింసించడమంటే సంస్కార రాహిత్యంగా భావిస్తాను. కనుక నాకూ - రచయిత్రుల నవలలోని రాక్షసులలాటి మగ పాత్రలకీ పోలిక ఉండదేమాత్రమూ సాయంత్రాలు నేనెలాగూ షికారు వెళ్లొస్తుంటాను కనుక -సరదాగా శ్రీమతితో షాపింగ్‌కీ వాకింగ్‌కీ వెళ్లడానికి సంకోచించను మంచి కంపెనీయివ్వగలను

"ఇన్ని కబుర్లు చెబుతున్నారే! మరి కట్నం సంగతి?' అని మీకు సందేహం కలుగుతుంది. అడగాలనిపిస్తుంది. ఔనా?

నా ఓటమి నంగీకరిస్తున్నాను. ఈ విషయంలో అమ్మనీ నాన్నగారినీ ఎదిరించలేని అసమర్థుడినీ, జయించలేని అశక్తుడినీ నా సంస్కారం కంటె వారి 'సంప్రదాయం' ఎక్కువ బలమైనది మరి. ఐతే ఒకటి మాత్రం నిర్ద్వంద్వంగానూ నిస్సందేహంగానూ చెప్పగలను పెళ్లయ్యాక, డబ్బు తెమ్మనో వస్తువులు తెమ్మనో, పుట్టింటిని దోచి ఇమ్మనో పీడించే హీనుడిని కానుగాక కాను కిరసనాయిలుతో హత్యచేసే కిరాతకుణ్ణి కానుగాక కాను జీవితం అనే సరదా ప్రయాణానికి శ్రీమతి జీవన సహచరి అని భావిస్తాను నేను అందుచేత మీ క్షేమంపట్ల మీకెటువంటి భయాలు సందేహాలూ అక్కరలేదు. నేను - మనిషినే తప్ప రాక్షసుడినీ కాను, దేవుడినీ కాను నా హద్దులూ శక్తిసామర్థ్యాలూ నాకు కొంత తెలుసు మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తాననో . క్షణ క్షణమూ మీ వెంటే ఉంటాననో అనలేను . ఎందుకంటే అలాగ నాకు సాధ్యమూకాదు, మీకూ యిట్టే బోరు కొట్టేస్తుంది. ఇరవైనాలుగుగంటలూ ప్రేమిస్తూ కూర్చుంటే ఆఫీసుకి వెళ్లి ... పనిచేసి ... జీతం ఎవరు తెస్తారు? జీతం లేకపోతే బువ్వొచ్చేదెలా? నేను గుమాస్తాని. నా జీతం మేరలో - సాధ్యమైనంతవరకు యిద్దరమూ సుఖ పడదాం నా జీతానికి మించినవయితే మీ కోరికలూ సరదాలూ తీర్చలేను సుమండీ

శిల్పా! ఈపాటికి నేనంటే ఏమిటో ... యీ ఉత్తరం దేనికో మీకు కొంత అవగాహన అయ్యే ఉంటుందనుకుంటాను ఇక మీరు ప్రశాంతంగా ఆలోచించుకోండి నా వంటి వాడితో సహ జీవనం సాగించేందుకు సుముఖులో కారో నిర్ణయించుకోండి. మీ నిర్ణయం మీద- వ్యక్తుల ... పరిస్థితుల వొత్తిడి ఉండకూడదు. మీకు మనస్పూర్తిగా అంగీకారమయితేనే మన వివాహం జరగాలి.

నా గురించి మీకు నేనెలా తెలిపానో అలాగే మీ గురించి ... మీ యిష్టాయిష్టాల గురించీ ... ఆలోచనల గురించి .. కోరికలు ... బలహీనతల గురించీ నిస్సంకోచంగానూ నిర్మొహమాటంగానూ వ్రాయండి. మీరు నన్నేకాదు, నేను మిమ్మల్నీ తెలుసుకోవాలి కదా?

సహ జీవనం సాగించవలసిన ఇరువురిలోనూ ఒకరు మరొకరితో సర్దుకుంటే చాలదు. రెండవవారు మొదటివారితో సర్దుకుపోగలగాలి. అలాగే మీరు నా గురించి మాత్రమేగాక నేనూ మీ గురించి తెలుసుకోవాలి. నాకు - అమ్మాయిల గురించి తెలిసినదల్లా - సినిమాలు చూస్తారనీ, సీరియల్స్ చదువుతారనీ. అవి - సరదాలే తప్ప వ్యసనాలేమీ కావు చిన్నచిన్న సరదాలు కూడా లేకపోతే జీవితం బోర్ కొట్టెయ్యదూ? వివాహం జరిగిపోవడమే కాదు ముఖ్యం. వివాహానంతరం యిద్దరూ ఏ ఇబ్బందీ లేక నిజంగా హాయిగా జీవించగలగాలి. అందుకే మీ గురించి తెలుసుకోవాలనే ఆత్రతా, శ్రద్ధా.

విద్యావతులూ సంస్కారులూ అయిన మీరు నా ఉత్తరాన్నపార్థం చేసుకోరనీ సరిగానే అర్థం చేసుకుంటారనీ నా ఆశాభావం. ముఖాముఖి మాట్లాడుకుందు కనుకూలించని పరిస్థితులూ పెద్దలూ. మరి కాబోయే వధూవరులు వొకరి గురించి వొకరు ముందుగా తెలుసుకుందుకు మన మధ్యతరగతి కుటుంబాలలో యిలాగ ఉత్తరాల ద్వారాకంటె మరో మార్గమూ ఉందనుకోను.

శిల్పా! కలసి జీవించవలసిన వాళ్లం - కళ్యాణం జరిగితే. అగ్ని సాక్షిగా జరిగేదే నమ్మకంగా కంటె అదే నమ్మకమేమిలనీ; పెయ్యోబద్ధాలతో జరిగే పెళ్లికంటే ఒక్క అబద్ధం కూడా లేకుండా అన్నీ నిజాలతో నే జరిగే పెళ్లి ఫలప్రదమవుతుందని విశ్వసించేవాడినీ - కనుక యీ ఉత్తరం.

మీ జవాబు కోసం - నా అడ్రస్ వ్రాసిన కవరు జత చేస్తున్నాను.

ఎదురుచూస్తూ ... భవదీయుడు

చక్రపాణి □

